క్లుప్తంగా

విద్యతో ఉన్నత శిఖరాలకు..



గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరూ తమ జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు ఉన్నత చదువులు అభ్యసించాలని యువనారీ హెల్త్‌కేర్ ట్రస్టు చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. వరంగల్ హనుమకొండలో షాహీన్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఏ కోర్సు చేస్తే ఉపాధి అవకాశాలు ఉంటాయనే అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత చదువులపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని చెప్పారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో వారు ఎంచుకునే గ్రూప్స్ పైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి పదోతరగతి వరకు చదివింది ఒక ఎత్తయితే ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదవడంపై వారి బంగారు భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆత్మ సంయమయోగః ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత – ఆత్మసంయమయోగః ధారావాహిక ప్రవచన కార్యక్రమాలు మొదలయ్యాయి. జరుబుల బంగారుబాబు సౌజన్యంతో సువీరానందస్వామి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 వరకు నిర్వహించనున్నారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సువీరానందస్వామి ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో సన్యాసమని పిలిచినది యోగమని తెలుసుకోవాలని అన్నారు. సంకల్ప త్యాగం చేయని వారు ఎవరూ యోగి కాలేరని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేతాజీనగర్ 2వలైనులో నివాసం ఉండే రవిబాబు (45) ఆర్థిక ఇబ్బందుల కారణంగా సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, కుమారుడిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి భార్య, కుమారుడిపై దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంజీవయ్యనగర్ 3వలైనులో నివాసం ఉండే జశ్వంత్ మద్యం సేవించి సోమవారం భార్య జ్యోతినిర్మలపై కత్తితో దాడికి యత్నించాడు. కుమారుడు దేవకుమార్ అడ్డురావడంతో స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జశ్వంత్‌ను అరెస్టు చేశారు.

బ్యాగులో బంగారు ఆభరణాలు చోరీ

గుంటూరు ఈస్ట్: బ్యాగులోని బంగారు ఆభరణాలు చోరికి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్యామలానగర్‌లో నివాసం ఉండే కె.రజిని తన బ్యాగులో వంద గ్రాముల బంగారు ఆభరణాలు ఉంచింది. సోమవారం బ్యాగు చూసుకోగా ఆభరణాలు కనిపించలేదు. పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయంలో పుస్తక సమీక్ష



ప్రత్తిపాడు: పుస్తక పఠనంతో మేథోశక్తి పెంపొందించుకోవచ్చని ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ అరుణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక సమీక్ష నిర్వహించారు. గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. కథల పుస్తకాలతో పాటు విజ్ఞాన, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చి పదాలు, పద్యాలు వారితో చదివించారు. అనంతరం వారికి కాపీ రైటింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ తల్లిదండ్రులు గ్రంథాలయాలకు తమ పిల్లలను పంపాలని సూచించారు. విద్యా సంబంధ విషయాలతో పాటు అనేక రకాల అంశాలను పిల్లలకు నేర్పించడం జరుగుతుందని అరుణ వివరించారు.

సర్కారు బడులకు
సరికొత్త రూపు

- దశాబ్దాల తరబడి అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడిన పాఠశాలలు
- గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పైసా నిధులు ఇవ్వని దైన్యం
- నాడు–నేడుతో దశ తిరిగిన ప్రభుత్వ పాఠశాలలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బ్రాండెడ్ సామగ్రితో కళ్లు చెదిరే అభివృద్ధి
- కార్పొరేట్ పాఠశాలల్లో సైతం లేని విధంగా అత్యాధునిక వసతులు కల్పన
- గుంటూరు తూర్పు పరిధిలో నాడు–నేడు మొదటి విడతలో రూ.2.11 కోట్లతో మూడు ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ
- నాడు–నేడు రెండో దశలో 50 పాఠశాలల్లో రూ.27.14 కోట్లతో ఆధునికీకరణ పనులు



రూ.43 లక్షలతో ఆధునికీకరించిన ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల



నాడు–నేడు రెండో దశలో రూ.23 లక్షలతో నూతనంగా నిర్మించిన తరగతి గదులు



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆధునిక డ్యూయల్ డెస్క్‌లపై విద్యార్థినులు(ఫైల్)



రూ.68 లక్షలతో ఆధునికీకరించిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

గుంటూరు ఎడ్యుకేషన్: మన బడి నాడు–నేడు కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోసింది. దశాబ్దాల తరబడి అరకొర వసతులతో కొట్టుమిట్టాడిన పాఠశాలలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన విద్యా విప్లవం పుణ్యమాని ప్రాణం పోసుకున్నాయి. గత టీడీపీ పాలనలో పాఠశాల్లో వసతుల కల్పనకు పైసా నిధులు విదల్చని పరిస్థితుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల వ్యవధిలో ఆధునికీకరణ బాట పట్టిన పాఠశాలలు సకల వసతులతో కళకళలాడుతున్నాయి. పేద, దిగువ మధ్య తరగతి, బడుగు, బలహీనవర్గాలకు ఆధునిక వసతులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి.

మొదటి విడతలో రూ.2.11 కోట్లతో ఆధునికీకరణ గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో నాడు–నేడు మొదటి విడతలో రూ.2.11 కోట్లతో మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆధునీకరించారు. కోవిడ్–19 ప్రభావంతో పనులు జరగని కారణంగా నియోజకవర్గ పరిధిలోని మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు మినహా, నగరపాలకసంస్థ యాజమాన్యంలోని పాఠశాలల్లో మొదటి విడతలో పనులు జరగలేదు. ప్రస్తుతం నాడు–నేడు రెండో విడతలో పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో ఆధునికీకరించిన పాఠశాలలను కలుపుకొని రెండో విడతలో మొత్తం 50 ప్రభుత్వ, నగరపాలకసంస్థ పాఠశాలల్లో రూ.27.14 కోట్ల వ్యయంతో 10 అంశాల ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పనతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి.

- నాడు–నేడు మొదటి విడతలో చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను రూ.43 లక్షలతో మోడల్ పాఠశాలగా ఆధునికీకరించిన ప్రభుత్వం, రెండో విడతలో మరో రూ.23 లక్షలతో తరగతి గదులను నిర్మించింది.
- బీఆర్ స్టేడియం వద్ద ఉన్న మహాకవి తిక్కన–పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రూ.కోటి వ్యయంతో సకల హంగులతో అభివృద్ధి పర్చారు.
- పాత బస్టాండ్ సెంటర్లోని వందేళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రూ.68 లక్షలతో ఆధునికీకరించారు.

10 అంశాల ప్రాతిపదికన మౌలిక వసతులు..

పాఠశాలల్లో 10 అంశాల ప్రాతిపదికన మౌలిక వసతులను కల్పిస్తున్నారు. సురక్షితమైన తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంటు, తరగతి గదుల్లో డ్యూయల్ డెస్క్‌లు, ఉపాధ్యాయులు కూర్చునేందుకు సౌకర్యవంతమైన కుర్చీలు, పాఠశాల మైదానంలో ఫ్లోరింగ్, తరగతి గదుల్లో విద్యుద్దీకరణ, ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు, గోల్డ్‌మెడల్ కంపెనీ స్విచ్ బోర్డులు, వైరింగ్ వ్యవస్థ, పనులకు అవసరమైన సామగ్రి మొత్తాన్ని ధనవంతుల ఇళ్లకే పరిమితమైన అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సామగ్రిని ఏర్పాటు చేశారు.

- పాఠశాలల్లోని టాయిలెట్లు ఆధునికంగా రూపుదిద్దుకున్నాయి. గత ప్రభుత్వాల మాదిరిగా ప్రభుత్వ ధనాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెట్టకుండా కమిషన్ల ఊసే లేకుండా ప్రతి పైసా పాఠశాలల అభివృద్ధికే వినియోగించే విధంగా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీలకు బాధ్యతలు అప్పగించి వారి ఆధ్వర్యంలోనే ప్రతి ఒక్క సామగ్రిని కొనుగోలు చేసి, సరఫరాదారులకు నగదు చెల్లింపులు జరుపుతున్నారు.

బ్రాండెడ్ సామగ్రి కొనుగోలు..

టాయిలెట్లలో ఏర్పాటు చేస్తున్న శానిటరీ సామగ్రి మొత్తం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బ్రాండ్లు అయిన సెరా, జాన్స్, కజారియా కంపెనీలవే కొనుగోలు చేశారు. జాన్సన్ కంపెనీ టైల్స్, సెరా కంపెనీ వాష్‌బేసిన్లు, బాత్‌రూమ్ ఫ్లోరింగ్ కజారియా కంపెనీ ఉత్పత్తులతో చేశారు. వాష్‌బేసిన్లు, కమోడ్స్, యూరినల్ పాట్స్ ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో ఫినోలెక్స్ వైర్‌తో విద్యుద్దీకరణ చేసి, గోల్డ్‌మెడల్, లెగ్రాండ్ కంపెనీ స్విచ్‌బోర్డులు, స్విచ్‌లు, సీలింగ్ ఫ్యాన్లు, ఎల్‌ఈడీ బల్బులు బిగిస్తున్నారు. తరగతి గదులతో పాటు పాఠశాల ప్రాంగణంలో అందమైన రంగులు, విద్యార్థులను ఆకర్షించే బొమ్మలతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. పాఠశాలల ప్రాంగణంలో గ్రీనరీతో పాటు ఆట వస్తువులు, క్రీడా పరికరాలు ఈ విధంగా కార్పొరేట్ సదుపాయాలతో పైసా ఖర్చులేని ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం రాజీ లేని ధోరణితో ఖర్చు చేస్తోంది.

ఎనిమిది నెలల పసికందుకు అరుదైన చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ ఆళ్ల సిద్దార్థరెడ్డి

గుంటూరు మెడికల్: పుట్టుకతోనే కంజినేటల్ ఈజోఫాజిల్ వెబ్ సమస్యతో బాధపడుతున్న ఎనిమిది నెలల పసికందుకు అరుదైన చికిత్స చేసినట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి చెప్పారు. సోమవారం గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని సిద్ధార్థ గ్యాస్ట్రో కేర్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా నగరం మండలం చిన మట్లపూడి గ్రామానికి చెందిన ఎం.శ్రావణి, విజయకుమార్‌లకు ఎనిమిది నెలల క్రితం బాబు పుట్టాడు. పుట్టుకతోనే బాబుకు అన్నవాహిక ప్రారంభదశలో గొంతులోపల పొర ఏర్పడి తల్లి నుంచి తాగే పాలు పొట్టలోకి వెళ్లకుండా ముక్కు ద్వారా బయటకు వచ్చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపించినా సమస్య నిర్ధారణ జరగక ఈనెల 16న తమ హాస్పటల్‌కు వచ్చారని డాక్టర్ సిద్ధార్థరెడ్డి చెప్పారు. పరీక్షలు చేసి పసికందు కంజినేటల్ ఈసోఫాజల్ వెబ్ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి సమస్య 50వేల జననాల్లో ఒకరికి వస్తుందన్నారు. అన్నవాహిక ప్రారంభదశలో గొంతుకు అడ్డుగా ఉన్న పొరను ఎలాంటి ఆపరేషన్ చేయకుండా ఈనెల 17న ఎండోస్కోపి ద్వారా ఎస్‌జీ డైలటేషన్ చేసి కేవలం 15 నిమిషాల వ్యవధిలో తొలగించామన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘననివాళి



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ఎక్కడ ప్రమాదం ఉందో అక్కడ ప్రకాశం.. ఎక్కడ ప్రజలు ఉంటే అక్కడ ప్రకాశం అనేలా సమాజాభ్యుదయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహామనిషి టంగుటూరి ప్రకాశం పంతులు అని విద్యావేత్త ఇనుపులపాటి చంద్రయ్య అన్నారు.

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి మనోఫలకం పై చిరస్మరణీయంగా నిలిచిన ఉద్దండమూర్తి టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. విశ్రాంత అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ అత్యంత నమ్మకంతో తన నిజమైన వారసుడిగా ప్రకాశం పంతులును గుర్తించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు నివాళులర్పించారు.

నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య..

లక్ష్మీపురం: ప్రజా క్షేమమే పరమావధిగా ఉద్యమమే ఊపిరిగా ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితం గడిపిన నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని సోమవారం అవగాహన సంస్థ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ సీనియర్ సభ్యులు సదాశివం, బసవ గుప్త, మల్లేశ్వరరావు, జనార్దన్ రావులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు కొల్లి నాగేశ్వరరావు

సీపీఐ కార్యాలయంలో నివాళులర్పించిన రైతు సంఘం నాయకులు



రైతు సంఘ నాయకుడు కొల్లి నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: ప్రముఖ రైతు ఉద్యమ నేత, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సీపీఐ నాయకులు అమరజీవి కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం జరిగింది. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైతు సంఘ సీనియర్ నాయకుడు పాపారావు మాట్లాతూ పత్తి రైతుల కోసం సుప్రీంకోర్టు దాకా వెళ్లి పోరాడిన ఘనత కొల్లి నాగేశ్వరరావుకు దక్కుతుందన్నారు. నదీ జలాల అనుసంధానం కోసం పోరాటు చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రైతు సంఘం నాయకులు పుప్పాల సత్యనారాయణ, కంజుల విఠల్ రెడ్డి, ముప్పాళ్ల శివశంకరరావు, పి.జగన్నాథం, యువజన, కార్మిక సంఘం నాయకులు జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, కాయల రామారావు, దేగల వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

పట్టాలపైకి పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గ్రామీణ ప్రాంతవాసులకు అవగాహన కల్పించిన ఆర్పీఎఫ్ పోలీసులు



పశువుల కాపరులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణదాసు

లక్ష్మీపురం: రైలు పట్టాలపై మూగ జీవాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే మూగ జీవాలతో పాటు రైలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణ దాసు తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలోని పెదకూరపాడు పరిసర ప్రాంతాలలో తాను.. రెడ్డిపాలెం, సిరిపురం పరిసర ప్రాంతాలలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు పశువుల కాపురులకు గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ సీఐ ఆర్.వీరబాబు ఆదేశాల మేరకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆయన మాట్లాడుతూ పశువులను, మూగ జీవాలను రైలు పట్టాలపై రానివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. రైలు పట్టాలపై మూగ జీవాలను నిర్లక్ష్యంగా వదిలేస్తే, దాని వల్ల కలిగే ప్రమాదాలకు రైలు రాకపోకల ఇబ్బందులకు పశువుల యజమానులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పశువుల కాపురులకు పలుమార్లు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పోలీసుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల పెదకూరపాడు, బండారు పల్లి, సిరిపురం ప్రాంతాల్లోని రైలు పట్టాలపై పశువుల పడి మృతి చెందడం జరిగిందన్నారు. ఈ ప్రమాదం జరగడం ద్వారా రెండు రైళ్ల రాకపోకలు నిలిచి పోవడం జరిగిందన్నారు. పశువులను రైలు పట్టాలపై వదిలిన యజమానులైన ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

25న ఆహ్వానం లక్ష్మి సంస్మరణ



ఆహ్వానం లక్ష్మి

తెనాలి: ఆహ్వానం మాసపత్రిక సంపాదకురాలు ఎస్ ఎస్ లక్ష్మి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనె 25న తెనాలిలో సంస్మరణసభను నిర్వహించనున్నారు. ఆహ్వానం లక్ష్మిగా సాహితీ లోకంలో గుర్తింపును పొందిన ఆమె గతేడాది మృతి చెందారు. ఆమెకు నివాళిగా పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఏడాదిపాటు ప్రతినెల ఒక మంచి పుస్తకంపై చర్చ నిర్వహించిన విషయం తెలిసిందే. చర్చలు ముగిసిన సందర్భంగా 25వ తేదీన ప్రథమ వర్ధంతి సంస్మరణను ఏర్పాటు చేశారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగే సభకు జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయితలు / కవులు వాడ్రేవు వీరలక్ష్మీదేవి, పాపినేని శివశంకర్, కాట్రగడ్డ దయానంద్, బండ్ల మాధవరావు, సమయం రాజా సంజీవదేవ్ పాల్గొంటారు.

విలువ జోడింపుతోనే రైతుకు ఆదాయం

హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



గుంటూరు రూరల్: రైతులు పండించిన పంటలకు విలువల జోడింపుతో మంచి ఆదాయం పొందవచ్చని హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్‌లో నిర్వహించిన రైతు శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగుకు విలువలను జోడించి మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండిరచిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వటం ఎంతో ఉపయోగకరమన్నారు. హార్టికల్చర్ డిప్యూటి డైరెక్టర్ వీఎస్ ధర్మజ, వీఏఎస్ డాక్టర్ రాంబాబు, సేంద్రియ రైతులు ఏడుకొండలు, శబరినాథ్, శివనాగమల్లేశ్వరరావు, జ్యోతి, చలపతిరావు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ మహేష్, ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర తదితరులు

గుంటూరు ఈస్ట్: పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం వెస్ట్ డీఎస్పీ మహేష్, ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు.

ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా ఉండేందుకు కవాతు నిర్వహించారు. నగరంపాలెం స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌ఓ మధుసూధనరావు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కేవీపీకాలనీ, తదితర ప్రాంతాల్లో అనుమానం ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ చేశారు.

తెనాలిలో పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: సినీ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వారి అభిమానుల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో సోమవారం పేదలు, యాచకులకు అన్నదానం చేశారు. ముందుగా జన్మదిన కేక్‌ను కట్ చేసి జూనియర్ ఎన్‌టీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నిర్వాహకులు వెంకటచౌదరి, బాషా జాన్‌లు మాట్లాడుతూ జూనియర్ ఎన్‌టీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మడి భార్గవ్, కొత్తపల్లి సాయి కృష్ణ, బాషా తలైవా, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి చేరిన 66,348 నోట్ పుస్తకాలు

- త్వరలో పాఠ్యపుస్తకాలు రాక
- ఇప్పటికే ఇండెంట్ పంపిన విద్యాశాఖ
- పాఠశాలలు పునః ప్రారంభం కాగానే పంపిణీ



తెనాలి చేరిన నోటు పుస్తకాలు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కాకముందే తెనాలికి నోట్ పుస్తకాలు వచ్చాయి. సుమారు 70 వేల నోట్ పుస్తకాలు తెనాలి ప్రాంతానికి అవసరం. అయితే ఉన్నతాధికారులు ఇప్పటికే 66,348 నోట్ పుస్తకాలను పంపారు. మిగిలిన వాటిని త్వరలో పంపనున్నారు. అలాగే తెనాలి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవరమైన పాఠ్య పుస్తకాల ఇండెంట్‌ను విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశారు. వాటిని కూడా కొద్దిరోజుల్లో తెనాలి పంపనున్నట్లు సమాచారం.

తెనాలి పట్టణ పరిధిలో 50 మున్సిపల్ పాఠశాలలు, రెండు ట్రిబల్ స్కూల్స్ ఉన్నాయి. తెనాలి మండల పరిధిలో 47 మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి పదోవ తరగతి వరకు గతేడాది 10,477 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. వీరికి పంపిణీ చేసేందుకు 70 వేల నోట్ బుక్స్, 1,68,936 టెక్స్ బుక్స్‌ను గతేడాది తెనాలి పంపింది.

ఈ ఏడాది కూడా ప్రస్తుతం అదే సంఖ్యలో టెక్స్, నోట్ బుక్స్ పంపేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. దానిలో భాగంగా నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టి వాటి రూపురేఖలు మార్చారు. అలాగే విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి కింద ఏడాదికి రూ.15 వేల నగదు జమ చేయటం, విద్యార్థులకు అవసరమైన నోట్, టెక్స్ బుక్స్, షూస్, సాక్సులు వంటి వాటిని జగనన్న విద్యా దీవెన కింద విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందించింది. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ప్రారంభించారు. అలాగే పదోవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ పెట్టటం వంటి చర్యలు చేపట్టడం వలన ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది. దీంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న చిన్నచూపు తొలగి తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వచ్చారు

నోటు పుస్తకాలు ..

తెనాలి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సుమారు 70 వేల నోట్, 1,68,936 పాఠ్య పుస్తకాలు అవసరం అని అధికారులు నిర్ధారించారు. అదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో ఉన్నతాధికారులు ఈ నెల మొదట్లోనే తెనాలికి అవసరమైన 70వేల నోట్ పుస్తకాలలో 66,348 ఇప్పటికే తెనాలి పంపింది. మిగిలిన వాటితో పాటు పాఠ్య పుస్తకాలు కూడా కొద్దిరోజుల్లో తెనాలి పంపనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జూన్ 12 పాఠశాలల పునః ప్రారంభం నాటికి అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయని అధికారులు చెపుతున్నారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అందుకు అనుగుణంగా నోటు, పాఠ్య పుస్తకాలు తెప్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను పునఃప్రారంభం నాటికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు.

నేడు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి జయంతి

తెనాలిఅర్బన్: శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి జయంతి వేడుకలను తెనాలి నాజరోపేటలో వేంచేసిన శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకాలు, స్వామి వారిని అలంకరించి మూల మంత్రంలో హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు సహస్ర నామార్చన, 22వ తేదీన స్వామి వారికి 108 బిందెల పానకంతో అభిషేకాలు చేయనున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృప, కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.